# బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర ప్రయోజనాలు

- నాగారం ప్రచారంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి
- వినూత్న ప్రచారంతో ఆకట్టుకున్న మల్లన్న

మేడ్చల్ కలెక్టరేట్, మే 10: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నాగారం మున్సిపాలిటీ పరిధి రాంపల్లిలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పర్యటించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గృహిణులు, దుకాణాదారులు, వాహనదారులు, కుల వృత్తుల వారిని కలుస్తూ బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మరోమారు మోసపోవొద్దని, తెలంగాణ తీసుకువచ్చిన బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర సంక్షేమం సాధ్యమని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపిస్తే ఇటు రాష్ట్రం, అటు కేంద్రంలోనే ప్రజల మేలు కోరి పోరాటం చేస్తారన్నారు. కేసీఆర్ రాజకీయంగా కీలకంగా వ్యవహరించి, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుతారని తెలిపారు. ఓటర్లు విజ్ఞతతో ఆలోచించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, ఉన్న పథకాలను కూడా తీసివేసే ఆలోచనలో ఉందన్నారు. స్థానికుడైన లక్ష్మారెడ్డిని గెలిపిస్తే మీ కుటుంబ సభ్యుడిగా ఉండి సేవలందిస్తారని, కారు గుర్తుకు ఓటేయాలని ఆయన కోరారు.

**బర్రెకు గడ్డి పెట్టి..**

ప్రచారంలో భాగంగా ఆయన పలు వార్డుల్లో పర్యటిస్తున్న క్రమంలో ఓ చోట పాడి బర్రెలు కన్పించాయి. వెంటనే ఆయన మనస్సు అటు లాగింది. పాల వ్యాపారం చేసిన పాత రోజులు గుర్తుకు వచ్చాయి. నిగనిగలాడుతున్న ఆ పాడి బర్రెల వద్దకు వెళ్లి, అప్యాయంగా గడ్డి తిన్పించి, ముందుకు సాగారు.

రాంపల్లిలో వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి

# నివేదిత విజయం లాంఛనమే..

**సర్వేలన్నీ బీఆర్ఎస్‌కే అనుకూలం**

**కంటోన్మెంట్‌లో జెండా పాతేది బీఆర్ఎస్సే**

- కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా సాగవు...
- డబ్బు సంచులను నమ్ముకున్న కాంగ్రెస్‌కు శాస్తి తప్పదు
- సమావేశంలో రావుల శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

కంటోన్మెంట్, మే 10: ఏ సంస్థలు చేపట్టినా సర్వేలన్నీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితకే అనుకూలంగా ఉన్నాయని, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌కు కనీసం దరిదాపుల్లోనూ కాంగ్రెస్, బీజేపీలు లేవని తేల్చిచెప్పారు. కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే పెద్ద ఎత్తున పలు వార్డుల్లో డబ్బులను పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా డబ్బులను పంపిణీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి ఆయన విన్నవించారు. ఈ మేరకు బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో రావుల శ్రీధర్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి చరిత్ర ఏంటో ప్రజలందరికీ తెలుసని, వెన్నెల గద్దర్‌కు టికెట్ ఇవ్వకుండా ఒక ఆడబిడ్డను కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు తప్పవని హితవు పలికారు. బీఆర్ఎస్‌తోనే కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. 30 ఏండ్లు కంటోన్మెంట్‌కు సేవ చేసిన సాయన్న కుమార్తె నివేదితను గెలిపించుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. కాంగ్రెస్ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికల్లో ఆ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని రావుల శ్రీధర్ రెడ్డి తెలిపారు. ప్రచారంలో అద్భుతంగా పనిచేసిన కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు, గులాబీశ్రేణులందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. కాంగ్రెస్‌కు లీడర్లు, క్యాడర్ లేదు కాబట్టే బీఆర్ఎస్ నేతలను ప్రలోభాలకు గురిచేసి బలవంతంగా ఆ పార్టీలోకి చేర్చుకుంటున్నారని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మండిపడ్డారు. అందుకే ఇతర పార్టీ నుంచి వచ్చిన అభ్యర్థికి టికెట్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఎలాగూ కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని, ప్రజలందరి ఆశీర్వాదం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితకే ఉందని స్పష్టం చేశారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే స్థానంతో పాటు మల్కాజిగిరి ఎంపీ స్థానంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని మర్రి రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు.

### లోక్‌సభ స్థానంలోనూ గులాబీ రెపరెపలు ఖాయం..

కంటోన్మెంట్ ప్రజలందరి ఆశీస్సులు తనకు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత సాయన్న స్పష్టం చేశారు. ప్రజలంతా తమ సొంత ఆడబిడ్డలా తనకు ఓటేయాలని కోరారు. కంటోన్మెంట్ ప్రజలతో సాయన్నకు విడదీయరాని అనుబంధం ఉందని గుర్తుచేశారు. సాయన్నలాగే ప్రజాసేవ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, కాబట్టి తనను దీవించాలని నివేదిత కోరారు. సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ శ్యాంకుమార్, లోక్ నాథ్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప హరి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ టీఎస్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి, నర్సింహ ముదిరాజ్, పలు వార్డుల బీఆర్ఎస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, మహిళా నేతలు, సాయన్న అభిమానులు పాల్గొన్నారు.

# ఉద్వేగంతో కాదు.. విజ్ఞతతో ఆలోచించండి

- అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కు పట్టంకట్టండి
- ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించండి
- కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ షోలో.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 10: పదేండ్ల కాలంలో కేపీహెచ్‌బీ కాలనీలో జరిగిన అభివృద్ధి, పేదలకు అందిన సంక్షేమ పథకాలను చూడాలని, ఉద్వేగంతో కాకుండా విజ్ఞతతో ఆలోచించి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. శుక్రవారం కేపీహెచ్‌బీ కాలనీలో నిర్వహించిన రోడ్ షోలో ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ, పదేండ్ల కాలంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ల సహకారంతో కూకట్‌పల్లి నియోజకవర్గం ఆదర్శవంతంగా అభివృద్ధి చెందిందన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు, బీసీ బంధు లాంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత బీఆర్ఎస్‌దన్నారు. కూకట్‌పల్లిలో కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు చేపట్టానని, తాగునీటి సమస్యల పరిష్కారం కోసం రిజర్వాయర్లు, పైపులైన్ వ్యవస్థలను ఆధునీకరించామని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్ పాసులు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. నగరంలో శాంతి భద్రతలను కాపాడటం వల్ల అంతర్జాయతీ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయని, తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో ప్రజలంతతా సంతోషంగా జీవిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని, వారి మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. కులాలు, మతాలుగా ప్రజలను విభజిస్తూ ఓట్లు రాబట్టేందుకు ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలని, నిత్యం అందుబాటులో ఉండి సేవలందించే రాగిడి లక్ష్మారెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పగుడాల శిరీషా బాబూరావు, డివిజన్‌ల అధ్యక్షులు ఎం.కృష్ణారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు, బీఆర్ఎస్ పార్టీల నేతలు, మహిళా నేతలు, యువకులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ షోలో బీఆర్ఎస్ పార్టీ నేతల భారీ ర్యాలీ

### నేడు బీఆర్ఎస్ మైనార్టీ సమావేశం

చిక్కడపల్లి, మే10: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం మూడు గంటలకు ముషీరాబాద్‌లోని కశిష్ ఫంక్షన్ హాల్లో ముస్లిం మైనార్టీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ముషీరాబాద్ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి తిగుళ్ల పద్మారావు గౌడ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యమంలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆయన కోరారు

### నేడు బీఆర్ఎస్ బైక్ ర్యాలీ

అమీర్‌పేట్, మే 10: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్‌కు మద్దతుగా శనివారం భారీ బైక్ ర్యాలీ జరుగుతుందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మారేడ్‌పల్లిలోని తన నివాసంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శనివారం మారేడ్‌పల్లిలోని షెనాయ్ ఆసుపత్రి సమీపంలోని గ్రౌండ్స్ దగ్గర ఈ బైక్ ర్యాలీని అభ్యర్థి పద్మారావు గౌడ్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ర్యాలీ మారేడ్‌పల్లి, మోండా మార్కెట్, పద్మారావునగర్, బన్సీలాల్‌పేట్, రాంగోపాల్ పేట్, బేగంపేట్, అమీర్‌పేట్, సనత్‌నగర్ డివిజన్ల మీదుగా కొనసాగి బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం వద్ద ముగుస్తుందని తెలిపారు. ఈ ర్యాలీకి పార్టీ శ్రేణులు అసంఖ్యాకంగా తరలి రావాలని పిలుపునిచ్చారు. మారుతున్న సమీకరణలతో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు ఊహించని విధంగా ప్రజల మద్దతు పెరిగిందని, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవశం చేసుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుర్రమ్ పవన్ కుమార్ గౌడ్, కార్పొరేటర్ కొలను లక్ష్మి రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎన్.శేషు కుమారి, నాయకులు కొలను బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌పై దాడి అమానుషం

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 10: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ జిల్లా భైంసాలో కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడికి పాల్పడటం, టమాటాలు, కోడిగుడ్లతో దాడి చేయడం అమానుషమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు అన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటని మండిపడ్డారు. చిల్లర కథలు చేయొద్దని, పోలీసులు ఏమి చేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నిస్తున్నప్పటికీ, మూకల రెచ్చగొట్టే ప్రయత్నాలకు ఆయన ఎక్కడా తొందరపడలేదని గుర్తు చేశారు. హింసను నమ్ముకుని గెలవాలనుకోవడం వారి ఆలోచనైతే, అహింసతో అందరి మనస్సులు గెలుచుకోవడం బీఆర్ఎస్ నైజమని స్పష్టం చేశారు. దశాబ్ద కాలంలో బీఆర్ఎస్ పాలనలో ఎక్కడ రాజకీయ నాయకులపై ఇటువంటి దాడులను ప్రోత్సహించలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఎక్కడా దాడులకు పాల్పడకుండా, సకల జనులను సమన్వయం చేసుకుంటూ స్వరాష్ట్రం సాధించిన పార్టీ బీఆర్ఎస్సేనని స్పష్టం చేశారు. మతం ముసుగులో బీజేపీ, ప్రభుత్వంలో ఉంటూ ప్రేక్షక పాత్ర పోషించిన పోలీసుల పాత్రలో కాంగ్రెస్ రెండూ ఒకటేనని మరోసారి రుజువైందన్నారు. ఓటమిని అంగీకరించలేని వారే ఇలా దాడులకు పాల్పడుతారని అన్నారు. దాడులు చేస్తున్నవారికి ఓటమి చెందుతామని అర్థమైందని అభిప్రాయపడ్డారు.

### వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీసీఏ 2,4, 6 సెమిస్టర్ ప్రాక్టికల్ మెయిన్, 1,3, 5 సెమిస్టర్ ప్రాక్టికల్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. దూరవిద్యా విధానంలో అందించే ఎంసీఏ నాలుగో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 21వ తేదీ నుంచి, బీకామ్, బీఏ కోర్సుల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## దివ్యాంగుల రిజర్వేషన్లను తగ్గించిన బీజేపీని ఓడిస్తాం

- ది డిఫరెంట్లీ ఏబుల్డ్ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు టి.కొమరయ్య

ఖైరతాబాద్, మే 10: దివ్యాంగుల రిజర్వేషన్లను తగ్గించిన బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని 'ది డిఫరెంట్లీ ఏబుల్డ్ అడ్వకేట్స్ అసోసియేషన్' అధ్యక్షులు టి.కొమరయ్య అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 లక్షల నుంచి 80 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని, అందులో 500 మందికి పైగా దివ్యాంగ న్యాయవాదులు ఉన్నారని తెలిపారు. దివ్యాంగులకు గత కేంద్ర ప్రభుత్వం ఐదు శాతం రిజర్వేషన్లు ఇస్తే, బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాలుగు శాతానికి చేశారని, దీంతో విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో నష్టపోయామన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగ న్యాయవాదులకు గవర్నమెంట్ ప్లీడర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ తదితర పోస్టుల్లో తమకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు ప్రాక్టీస్ మొదలు పెట్టినప్పటి నుంచి ఐదు సంవత్సరాల వరకు ప్రతి నెల రూ.5వేల స్టయిఫండ్ ఇవ్వాలన్నారు. సమావేశంలో దివ్యాంగ న్యాయవాదులు కె.దేవేందర్, కె.సంజీవ రెడ్డి, వై.కొండల్ రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న దివ్యాంగ న్యాయవాదులు

## సికింద్రాబాద్‌లో పద్మారావును గెలిపించాలి

మెహిదీపట్నం డివిజన్ భోజగుట్టలో రోడ్డు షోలో ఓటు అభ్యర్థిస్తున్న మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, నియోజకవర్గం ఇన్‌ఛార్జి సీహెచ్ ఆనంద్ కుమార్ గౌడ్, మెట్టు నటరాజ్, సంతోష్ కుమార్ తదితరులు

మెహిదీపట్నం మే 10: సికింద్రాబాద్ లోక్‌సభకు తీగుళ్ల పద్మారావును ఎంపీగా గెలిపించడానికి ప్రజలు బీఆర్ఎస్‌కే ఓటు వేయాలని మాజీ హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. నాంపల్లి నియోజకవర్గం మెహిదీపట్నం డివిజన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు తరపున రోడ్ షోను మాజీ హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ, నియోజకవర్గం ఇన్‌ఛార్జి సీహెచ్ ఆనంద్ కుమార్ గౌడ్, మెట్టు నట్‌రాజ్, అర్షద్ అలీలతో కలిసి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, బీజేపీ ఎంపీగా ఉన్న కిషన్‌రెడ్డి ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉన్న దాఖలాలు లేవని, సికింద్రాబాద్‌లో ఎల్లప్పుడు ప్రజల కోసం పనిచేసే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావును ప్రజలు గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచారంలో నాయకులు హింగోళి కార్ సంతోష్ కుమార్, అశ్విన్ మార్గం, చెన్నబత్తిని లక్ష్మీనారాయణ, అభిషేక్ రాజ్, సంజయ్, యాద శ్రీనివాస్ గుప్తా, యూసుఫ్, అబ్దుల్ కలీం, ప్రదీప్ కుమార్ అగర్వాల్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఎందుకు ఓటెయ్యాలి

- అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చేందుకు మనస్సు రాలేదు
- రాహుల్, మోదీ గ్యారెంటీలను నమ్మొద్దు: బీఎస్పీ నేత కృష్ణ

ఖైరతాబాద్, మే 10: స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీకి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కు భారత రత్న ఇవ్వడానికి మనస్సు రాలేదని, అలాంటి పార్టీకి దళిత, బహుజనులు ఎందుకు ఓటు వేయాలని బీఎస్పీ హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి, సీనియర్ నాయకులు, సుప్రీం కోర్టు న్యాయవాది కృష్ణ ప్రశ్నించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అంబేద్కర్‌కు సరైన విలువనివ్వలేదని, చివరికి బహుజన నేత కాన్షిరాం ఉద్యమాలతో దివంగత మాజీ ప్రధాని వీపీ సింగ్ సంకీర్ణ ప్రభుత్వ హయాంలో ఇచ్చారని గుర్తు చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీ, ఏఐసీసీ నేత రాహుల్ గాంధీలు ఇద్దరూ గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని, దానికి బీఎస్పీ అధినేత్రి మాయావతిని ప్రధాని చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ బస్వాసందం, బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.దయానంద్ రావు, గిరి మహరాజ్, బాలరాజు, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది కృష్ణ

## ప్రజాస్వామ్యంలో ఓటే.. వజ్రాయుధం

మేడ్చల్, మే 10: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పదునైన ఆయుధమని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి అన్నారు. కళాశాల విద్యార్థులు ఓటు వినియోగంపై గుండ్ల పోచంపల్లిలో కళాశాల ఎన్ఎస్ఎస్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చాలా మంది పోలింగ్‌కు దూరంగా ఉంటున్నారని, ప్రజలకు మేలు చేసే నాయకున్ని ఎన్నుకునేందుకు ఓటు హక్కున్న ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ సరోజ, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, పీఆర్వో రవి సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అసం రాజేశ్ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

## మార్కెట్‌లోకి జడ్ సిరీస్ న్యూ స్విఫ్ట్..

జూబ్లీహిల్స్, మే 10: వరుణ్ మోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మార్కెట్‌లోకి మారుతి సుజికీ సరికొత్త జడ్ సిరీస్ ఇంజిన్‌తో 'ది ఎపిక్ న్యూ స్విఫ్ట్' కారును విడుదల చేసింది. కొంపల్లి షోరూమ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సినీనటి హెబ్బా పటేల్, ఎంఎస్ఐఎల్ రీజనల్ మేనేజర్ (ఏపీ, టీజీ) బిక్రమ్ సత్‌పతి, జీఎం కృష్ణ కుమార్, ఏజీఎం శ్రీకాంత్‌లతో కలిసి జడ్-సిరీస్ ఇంజిన్ కారును ఆవిష్కరించారు. విప్లవాత్మక జడ్ సిరీస్ ఇంజిన్ పనితీరును, అధిక ఇంధన సామర్థ్యం, ఆరు ఎయిర్ బ్యాగ్‌లు, అన్ని సీట్లకు మూడు పాయింట్ సీట్ బెల్ట్‌లతో భద్రతా ప్రయోజనాలున్నాయని వెల్లడించారు. ఈ న్యూ స్విఫ్ట్ ఎక్స్ షోరూమ్ ధర రూ.6.49 లక్షలు ఉంటుందన్నారు.

## లెవల్ కోర్సుకు హెచ్‌సీఏ నోటిఫికేషన్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఔత్సాహిక అంపైర్లు, స్కోరర్లు, క్యూరేటర్లకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అద్భుత అవకాశం కల్పిస్తున్నది. అర్హులైన అభ్యర్థులకు బిగినర్స్ లెవల్ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంపైర్లు, స్కోరర్లు, క్యూరేటర్లుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ వరకు జింఖానాలో హెచ్‌సీఏ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ప్రతి విభాగంలో 25 మంది అభ్యర్థులను ఎంపిక చేసి హెచ్‌సీఏ ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పిస్తామన్నారు. క్రికెట్‌పై మెరుగైన అవగాహన, ఇంటర్ పూర్తి చేసి 18 ఏండ్ల నుంచి 40 ఏండ్లలోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఇందులో మాజీ క్రికెటర్లకు ఎంపికలో తొలి ప్రాధాన్యం ఉంటుంది. పూర్తి వివరాల కోసం hycricket.orgను సంప్రదించవచ్చు. ఇదిలా ఉంటే విదేశీ పాస్‌పోర్ట్ ఉంటే దేశవాళీ జూనియర్ క్రికెట్ ఆడేందుకు అనర్హులని హెచ్‌సీఏ స్పష్టం చేసింది. గత అపెక్స్ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలతో బీసీసీఐ ఈ నిబంధనలు రూపొందించింది.

## మాదిగ ఉప కులాలకు న్యాయం చేయాలి

- దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ రేణుకుంట్ల ఎల్లయ్య మాదిగ

హిమాయత్‌నగర్, మే 10: లోక్‌సభ సీట్ల కేటాయింపుల్లో మాదిగలకు అన్యాయం జరిగిందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ రేణుకుంట్ల ఎల్లయ్య మాదిగ అన్నారు. ఈ తరుణంలో మంత్రి పదవితో పాటు కార్పొరేషన్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 80 లక్షల మంది మాదిగలు ఉన్నారని, మాదిగల ఉప కులాలకు సైతం తగిన న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో మాదిగ ఉప కులాల జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం, నాయకులు హనుమంత్, యాక స్వామి, గడిపె నాగయ్య, కీసర మురళి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రేణుకుంట్ల ఎల్లయ్య